# సాక్షి జగిత్యాల

శనివారం । 18 । మార్చి । 2023




## భక్తుల పుణ్య స్నానాలు

ధర్మపురి: ధర్మపురిలోని గోదావరినదిలో శుక్రవారం భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. గంగమ్మ, గౌరమ్మకు మొక్కులు చెల్లించి నైవేద్యాలు సమర్పించారు.



## రాజన్నా దీవించు

వేములవాడ: వేములవాడ రాజన్నను శుక్రవారం 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. తలనీలాలు, నిలువెత్తు బంగారం, కోడె మొక్కులు చెల్లించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
27.0/20.0

## వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి వేళ ఈదురుగాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### వేంకటేశ్వరస్వామికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారిని రంగురంగుల పూలతో అలంకరించారు. అర్చకుడు శ్రీనివాసచార్యులు ప్రత్యేక పూజలు జరిపి ఆలయ ప్రాంగణంలో లక్ష్మీహవన కార్యక్రమాన్ని చేపట్టారు.

### విద్యార్థులకు ఇబ్బందులు కలగనివ్వొద్దు



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాల: విద్యార్థులకు ఇబ్బందులు కలగనివ్వొద్దని అదనపు కలెక్టర్ లత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని శ్రీవాణి సహకార జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పరీక్ష కేంద్రంలో ప్రతి చోట సీసీ కెమెరాలు పనిచేయాలని, అన్ని సౌకర్యాలు ఉండాలని ఆదేశించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలన్నారు. ఎవరైనా విద్యార్థులకు భయం, ఆందోళన ఉంటే టెలిమానస్ టోల్‌ఫ్రీ నంబరు 14416కు ఫోన్ చేయాలన్నారు. శుక్రవారం మూడో రోజు పరీక్షకు 95.46 శాతం విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

### ఆలయాల అభివృద్ధికి రూ.20 కోట్లు



ఇబ్రహీంపట్నంలో వివరాలు సేకరిస్తున్న రామ్‌నాథం

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): తెలంగాణలోని 8 జిల్లాల్లో 192 ఆలయాల అభివృద్ధికి 2వ విడత తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు రూ.20 కోట్లు మంజూరైనట్లు టీటీడీ ఇన్‌స్పెక్షన్ అధికారి డాక్టర్ రామ్‌నాథం తెలిపారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంతోపాటు అమ్మక్కపేట, గోధూర్ గ్రామాల్లో ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు కాగా శుక్రవారం వాటిని సందర్శించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులుగా ఉండి అత్యధికంగా నిధులు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నేమూరి సత్యనారాయణ, జాజాల జగన్‌రావు, పంచాయతీ కార్యదర్శి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల సలహాలు పాటించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న సెక్టోరియల్ అధికారి రాజేశ్

సారంగాపూర్(జగిత్యాల): పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం నిర్వహించే అదనపు తరగతులు రానున్న బోర్డు పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి దోహదపడతాయని జిల్లా సెక్టోరియల్ అధికారి కె.రాజేశ్ పేర్కొన్నారు. మండలంలోని రేచపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం అందుతున్న అల్పాహారం, అదనపు తరగతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు వచ్చే బోర్డు పరీక్షలకు సిద్ధం కావాలని, మంచి మార్కులు సాధించాలన్నారు. ఇందుకు ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు తీసుకుంటూకష్టపడి చదవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సిహెచ్.శరత్‌బాబు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, బాలచంద్రుడు తదితరులు ఉన్నారు.

# నేలవాలిన మక్క.. తడిసిన పసుపు



- 'ఈ రైతు పేరు గోపిడి శ్రీనివాస్. రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామం. 3 ఎకరాల్లో మొక్కజొన్న వేశాడు. పంట చేతికి వస్తుందని సంబరపడ్డాడు. అయితే గురువారం రాత్రి ఈదురు గాలులతో కూడిన అకాల వర్షంతో పంట నేలవాలింది. దీంతో శ్రీనివాస్ కన్నీళ్ల పర్యంతమవుతున్నాడు. అకాల వర్షంతో నోటికాడికచ్చిన పంటలు దెబ్బతిన్నడంతో రైతన్నలు తల్లడిల్లుతున్నారు'.



తడిసిన పసుపు పంట

- పంటలు అమ్ముకునే దశలో అకాల వర్షం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షంతో కోతకు వచ్చిన మొక్కజొన్న నేలవాలింది. ఆరబెట్టిన పసుపు తడిసిపోయింది. మరో రెండురోజులు కూడా ఈదురు గాలులతో కూడిన వర్షాలు ఉండటంతో పంటలు ఏమైపోతాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే, జిల్లాలో ఎండబెట్టిన, కోతకు వచ్చిన పంటలు దాదాపు 2- 3 వేల ఎకరాల్లో దెబ్బతిన్నా.. వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు మాత్రం జిల్లాలో ఎలాంటి పంట నష్టం జరగలేదని చెబుతున్నారు.

**చేతికొచ్చిన తరుణంలో..**

ఈ యాసంగిలో సాగు చేసిన మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం జరిగింది. అలాగే పసుపును ఉడుకబెట్టి, ఆరబెట్టి, రెండు రోజుల్లో మార్కెట్‌కు తీసుకెళ్తామన్న తరుణంలో వర్షంతో పంట నానింది. ఇక మామిడి పిందె నుంచి కాయ ఏర్పడుతున్న తరుణంలో బలమైన ఈదురుగాలులతో కాయలు సైతం నేలరాలాయి. అయితే రైతులు సాగు చేసిన ఏ పంటలోనైనా 33 శాతం నష్టం జరిగితేనే ప్రభుత్వ నిబంధనల మేరకు వ్యవసాయాధికారులు సర్వే చేసి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించే అవకాశం ఉంది. ఇప్పటి వరకు వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులకు క్షేత్ర స్థాయిలో పంట నష్టం జరిగినట్లు ఎలాంటి రిపోర్టు రాలేదని తెలిసింది.

**మొక్కజొన్నకు నష్టం**

జిల్లాలో దాదాపు 35 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. అయితే చాలా మండలాల్లో ఇప్పటికే కోతలు పూర్తయి కంకులను ఆరబెడుతున్నారు. రాయికల్, మేడిపల్లి మండలాల్లో ఈదురుగాలులకు పంట నేలవాలింది. మల్లాపూర్, ఇబ్రహీంపట్నం తదితర మండలాల్లో కల్లాల్లో ఆరబెట్టిన కంకులు తడిసిపోయాయి. దీంతో వాటిని ఆరబెట్టడం రైతులకు సమస్యగా మారింది. మొక్కజొన్న ఎకరాకు రూ.25 వేల వరకు రైతులు ఖర్చు పెడుతుండగా, ఆ మేరకు కూడా పంట వచ్చేలా లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. పసుపు పంట ఎకరాకు రూ.80 వేల వరకు ఖర్చు పెట్టగా, ఈ ఏడాది ధరలు లేక పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ఈ సీజన్‌లో అంతంతమాత్రంగా మామిడి తోటల్లో కాయలు ఉండగా, ఈదురుగాలికి ఉన్న కాయలు కూడా రాలిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### మల్లాపూర్‌లో 15.8 మి.మీ వర్షం

మల్లాపూర్(కోరుట్ల): మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు పలుగ్రామాల్లో గురవారం రాత్రి పిడుగులు, మెరుపులతో భారీవర్షం కురిసింది. గుండంపల్లిలో పిడుగుపాటుకు సంకోజి రాజేందర్ ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నది. మండల వ్యాప్తంగా 15.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

### పరిహారం అందించాలి



వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలను ప్రభుత్వానికి పంపించాలి. చాలా చోట్ల మొక్కజొన్నకు నష్టం జరిగింది. ఇప్పటికే ఓ వైపు పసుపునకు ధర లేదు. ఉన్న పంటను అమ్ముకుందామంటే వర్షంతో తడిసిపోయింది.

– ఏలేటి జలేందర్, రైతు నాయకుడు, ఇటిక్యాల

### భారీ నష్టం జరిగితే సమాచారమివ్వండి



ప్రభుత్వ నిబంధనల మేరకు 33 శాతం నష్టం జరిగితేనే నివేదికలు రూపొందించడం జరుగుతుంది. ఇప్పటి వరకు ఆ మేరకు నష్టం జరిగినట్లు సమాచారం లేదు. ఎక్కడైన భారీ నష్టం జరిగితే మా సిబ్బందికి సమాచారం అందిస్తే క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తాం.

– సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

## ఏప్రిల్ 14 నుంచి ఇంటింటికీ సీపీఐ

- పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

కోరుట్ల: ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి నుంచి బీజేపీ హఠావో దేశ్‌కి బచావో నినాదంతో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకటరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కోరుట్లలోని సి.ప్రభాకర్ భవన్‌లో నిర్వహించిన జిల్లా కార్యవర్గ విస్తృత సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించినట్లు 13.5 లక్షల మందికి 14 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో సీపీఐ ఆధ్వర్యంలో బస్సు, సైకిల్, పాదయాత్రలతో ప్రజలను చైతన్య పరుస్తామని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వెన్న సురేష్, నాయకులు చెన్న విశ్వనాథం, సుతారి రాములు, ఎండీ ముఖ్రం, శంకర్, ఎండీ ఉస్మాన్, శ్రీగాద దేవదాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటరెడ్డి

**పేదల భూముల్లో ఫ్యాక్టరీల ఏర్పాటును అడ్డుకుంటాం**

మెట్‌పల్లి(కోరుట్ల): పేదల భూముల్లో ఫ్యాక్టరీల ఏర్పాటును అడ్డుకుంటామని చాడ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మెట్లచిట్టాపూర్‌లో పలు కంపెనీలకు కేటాయించిన భూములను శుక్రవారం పరిశీలించారు. పేదల భూములను ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి పేదలకు అన్యాయం జరగకుండా చూడాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు.

### సరుకులు అందించాలి

ధర్మపురి: అంగన్‌వాడీ కేంద్రాలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సరుకులను పేరు నమోదైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు హరికల్ల దేవయ్య పేర్కొన్నారు. శుక్రవారం ధర్మపురిలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం మండలంలోని బుద్దేశ్‌పెల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో బాలల పరిరక్షణ అధికారి హరి, ఇన్‌చార్జి సీడీపీవో కుసుమ తదితరులున్నారు.

### రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి రూ.6.95 కోట్లు

పెగడపల్లి(ధర్మపురి): మండలంలోని వివిధ గ్రామాల్లోని పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ కింద రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి రూ.6.95 కోట్లు మంజూరైనట్లు మంత్రి ఈశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం మంత్రి ఫోన్‌లో ×సాక్షి×తో మాట్లాడారు. మంజూరైన నిధులు, పనుల వివరాలను వెల్లడించారు. పెగడపల్లి పీడబ్ల్యూడీ రోడ్ నుంచి మద్దులపల్లి వరకు రహదారి నిర్మాణం కోసం రూ.3 కోట్లు, నంచర్ల నుంచి రంగదామునిపల్లి మధ్య ఉన్న కల్వర్టుకు రూ.1 కోటి, ఏడుమోటలపల్లిలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.50 లక్షలు, ఆరవెల్లి నుంచి బతికపల్లి రహదారిపై కల్వర్టుకు రూ.75 లక్షలు, రాములపల్లి నుంచి లింగాపూర్ రహదారిలో కల్వర్టుకు రూ.50 లక్షలు, ఎల్లాపూర్ నుంచి ల్యాగలమర్రి రహదారిలో కల్వర్టుకు రూ.50 లక్షలు, లక్ష్మీపూర్‌లో బ్రిడ్జికి రూ.30 లక్షలు, అయితిపల్లిలో చెరువు వద్ద ఇటీవల తెగిన కల్వర్టుకు రూ.40 లక్షల చొప్పున నిధులు మంజూరైనట్లు మంత్రి వివరించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సస్పెన్షన్

- లైంగిక వేధింపులను తీవ్రంగా పరిగణించిన కలెక్టర్
- వెంటనే సస్పెండ్ చేయాలని డీఈవోకు కలెక్టర్ ఆదేశాలు
- విచారణ పూర్తయ్యేవరకు జగిత్యాలలోనే ఉండాలని స్పష్టీకరణ
- ఫిర్యాదు చేస్తే కేసు నమోదుకు సిద్ధం: ఎస్పీ భాస్కర్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని ఇటిక్యాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం శ్రీనివాస్ సస్పెండ్ అయ్యాడు. తోటి మహిళా టీచర్లను లైంగికంగా వేధిస్తున్న వీడియోలు వెలుగుచూడటంపై కలెక్టర్ యాస్మిన్ భాషా సీరియస్ అయ్యారు. అతనిపై వచ్చిన ఆరోపణలన్నీ వాస్తవమని తేలడంతో అతన్ని సస్పెండ్ చేస్తామని గురువారం రాత్రి 'సాక్షి'కి తెలిపారు. వెంటనే రాత్రికి రాత్రి ప్రిన్సిపాల్, పీజీటీ ఎం.శ్రీనివాస్‌ను సబ్‌రూల్ వన్ ఆఫ్ ఎయిట్ ఆఫ్ తెలంగాణ సివిల్ సర్వీసెస్ రూల్ (సీసీఏ) 1991 ప్రకారం.. వెంటనే సస్పెండ్ చేయాలంటూ జిల్లా విద్యాధికారికి (డీఈవో)కు అధికారికంగా ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు తక్షణమే అమలులోకి వస్తాయని, ఈ వ్యవహారంలో మరింత లోతుగా దర్యాప్తు జరపాలని డీఈవోకు సూచించారు. ఈ ఆదేశాలు శుక్రవారం మీడియాకు విడుదల చేశారు. విచారణ జరుగుతున్నంత కాలం శ్రీనివాస్ అందుబాటులోనే ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనే సమాచారం ఇవ్వకుండా జగిత్యాల జిల్లా కేంద్రం వీడి వెళ్లకూడదని స్పష్టంచేశారు. ఈ ఉత్తర్వుల కాపీలను హైదరాబాద్‌లోని మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరెక్టర్‌కు, అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్)కు సైతం పంపారు.

### కలెక్టర్ యాస్మిన్‌పై ప్రశంసలు..!

ఇటిక్యాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్ లైంగిక వేధింపులను సాక్షి దినపత్రిక 'టీచకుడు' అన్న పేరుతో వెలుగులోకి తీసుకువచ్చింది. అతను స్టాఫ్‌రూంలో మహిళలను అసభ్యకరంగా తాకుతూ, లైంగికంగా వేధిస్తున్నపుడు తీసిన వీడియోలు, ఫొటోలను 'సాక్షి' కలెక్టర్ కార్యాలయానికి పంపింది. దీనిని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ బాధితులను రక్షించేందుకు రంగంలోకి దిగారు. వెంటనే కీచక గురువును రాత్రికి రాత్రే సస్పెండ్ చేశారు. దీంతో కలెక్టర్ యాస్మిన్ బాషాపై ప్రశంసల వర్షం కురుస్తోంది. తమను ఆదుకున్న కలెక్టర్‌కు బాధితులు, మహిళా సిబ్బంది, విద్యార్థులు అంతా మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా ప్రజలు, నెటిజన్లు సైతం సైతం కలెక్టర్ యాస్మిన్ బాషాను అభినందిస్తున్నారు. అదే సమయంలో అతనిపై ఫిర్యాదు చేస్తే కేసునమోదు చేసేందుకు జిల్లా పోలీసులు సిద్ధంగా ఉన్నారని ఎస్పీ భాస్కర్ హామీ ఇచ్చారు.

## హనుమాన్ జయంతికి పటిష్ట భద్రత



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ భాస్కర్

- ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: కొండగట్టులో హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా నిర్వహించే మహోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అధికారులను ఆదేశించారు. కొండగట్టుపైన ఏర్పాటు చేసిన పోలీస్ ఔట్ పోస్ట్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. పోలీస్ అవుట్ పోస్టుకు అనుసంధానం చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఎలాంటి నేరాలకు తావులేకుండా భద్రత కల్పించాలన్నారు. మాలవిరమణ, క్యూలైన్లలో, వాహనాల రాకపోకలు మొదలైన ప్రదేశాల్లో భద్రత గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్పీ వెంట డీఎస్పీ ప్రకాష్, సీఐ రమణమూర్తి ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ధర్మపురి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా స్పెషల్ అధికారి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మండలంలోని జైనా ప్రభుత్వ పాఠశాల మన ఊరు– మన బడి కింద ఎంపిక కాగా, విద్యార్థులకు సరిపడా వసతులు కల్పించామని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడం జరుగుతుందని వివరించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో మన ఊరు– మన బడి కింద ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల్లో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్, టీపీ రంజిత్, హెచ్‌ఎం అనూష తదితరులున్నారు.



పాఠశాల వద్ద లక్ష్మీనారాయణ తదితరులు

### అర్ధరాత్రి వరకు డీజేలు పెట్టొద్దు

జగిత్యాలక్రైం: జగిత్యాల సబ్ డివిజన్ పరిధిలో పెళ్లిళ్లు, శుభకార్యాలు, ర్యాలీలు, సమావేశాలకు అర్ధరాత్రుల వరకు డీజేలు పెట్టొద్దని డీఎస్పీ ప్రకాశ్ అన్నారు. శుక్రవారం ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో డీజే యజమానులు, ఫంక్షన్‌హాల్ నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతీ ఫంక్షన్‌హాల్ నిర్వాహకులు రాత్రి వేళల్లో డీజేలు పెట్టి స్థానికులను ఇబ్బందులు కలిగించొద్దన్నారు. గ్రామాలు, పట్టణాల్లో బరాత్‌లు, ఇతర సమావేశాల పేరిట రాత్రి వరకు డీజే సౌండ్‌లు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విద్యార్థులకు పరీక్షల సమయంతో పాటు, చాలా మంది అధిక ధ్వనితో గుండెపోటుకు గురవుతున్నారని, నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. సమావేశంలో టౌన్ సీఐ కిశోర్, ధర్మపురి సీఐ కోటేశ్వర్, రూరల్ సీఐ ఆరిఫ్ అలీఖాన్, ఎస్సైలు అనిల్, మనోహర్‌రావు, కిరణ్ పాల్గొన్నారు.

# ధర్మసముద్రంపై నిర్లక్ష్యం

- విస్తరణకు నోచుకోని జలాశయం
- పట్టణవాసులకు జలప్రదాయిని
- పట్టించుకోని పాలకవర్గం
- చెరువు కట్ట ఎత్తు, మరమ్మతుకు సర్వే చేసి వదిలేసిన అధికారులు

జగిత్యాల: జగిత్యాల పట్టణవాసులకు తాగునీరు అందించే ధర్మసముద్రం నిర్లక్ష్యానికి గురవుతోంది. ఇందులోకి ఎస్సారెస్పీ కాలువ ద్వారా వచ్చిన నీటిని ఫిల్టర్‌బెడ్‌లో నింపుతూ తాగునీటిని అందిస్తుంటారు. కాగా ధర్మసముద్రం పూర్తిస్థాయిలో సక్రమంగా లేకపోవడంతో నీరు వృథాగా పోవడంతోపాటు చెరువుకట్ట సైతం చిన్నసైజులో ఉంది. గతేడాది కురిసిన వర్షాలకు అక్కడక్కడ గండ్లు పడ్డాయి. గతంలో కాల్వకు అడ్డుగా ఇసుక బస్తాలు వేసి ఎస్సారెస్పీ నీటిని ధర్మసముద్రంలోకి తరుచూ నింపాల్సి వచ్చేది. ఇటీవల మిషన్ భగీరథ ప్రారంభం కావడంతో నేరుగా జలాశయం వద్దనున్న ఫిల్టర్‌బెడ్‌కు భగీరథ పైప్‌లైన్‌ను అనుసంధానం చేశారు. ఎప్పుడైనా భగీరథ పైప్‌లైన్ చెడిపోయినా, పైనుంచి నీరు రాకున్నా ధర్మసముద్రం నీటినే ఫిల్టర్‌బెడ్‌లోకి నింపి సరఫరా చేస్తుంటారు. కాగా భగీరథ నీరు రావడంతో జలాశయాన్ని పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

**తగ్గిన నీటినిల్వ సామర్థ్యం**

ఏటా వేసవికాలంలో పట్టణవాసులకు నీటి సమస్య తలెత్తుతోంది. భగీరథతో పాటు ధర్మసముద్రంలో నీరు ఉంటేనే ప్రజలకు నీటి ఇబ్బందులు ఉండవు. కాగా జలాశయంలో పూడిక పెరిగిపోయి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. ప్రస్తుతం పట్టణవాసులకు కనీసం రెండునెలల పాటు నీరు సక్రమంగా అందించే పరిస్థితి కనిపించడంలేదు. 8 ఏళ్ల క్రితం అప్పటి పాలకవర్గం పూడికతో పాటు కట్ట ఎత్తు పెంచేందుకు ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించగా ఆచరణకు నోచుకోలేదు. ప్రస్తుత పాలకవర్గం సైతం దానిని పట్టించుకోకపోవడంతో ధర్మసముద్రం పూర్తిగా పూడికతో నిండిపోయి అక్కడక్కడ కట్ట తెగిపోయింది.



జగిత్యాలలోని ధర్మసముద్రం జలాశయం

**135 ఎకరాల విస్తీర్ణంలో..**

ధర్మసముద్రం చెరువు 135 ఎకరాల్లో విస్తరించి ఉంది. గతంలో మరింత పెంచేందుకు లింగంపేట రైతుల నుంచి 80 ఎకరాల వరకు భూములను సేకరించారు. ట్యాంక్ పరిధి పెంచేందుకు భూములను సేకరించినా వృథాగానే ఉంటున్నాయి. ప్రస్తుతం నీటి సామర్థ్యం 30 అడుగులు ఉండగా, ఒక్కసారి ఎస్సారెస్పీ నీటిని నింపితే మూడునెలల పాటు పట్టణ ప్రజలకు సరిపోయేది.

**అటకెక్కిన సర్వే..**

ధర్మసముద్ర నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు అధికారులు గతంలో సర్వే నిర్వహించినా అది మూలనపడింది. చెరువు కట్టను 1.5 మీటర్ల ఎత్తు పెంచాల్సిన అవసరం ఉందని అప్పుడు అధికారులు నిర్ణయించారు. చెరువు ఎత్తు పెంచి ఒక్కసారి నింపితే ప్రజలకు ఆరునెలలకు సరిపడా నీరు నిల్వ చేయొచ్చని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు కట్ట ఎత్తు పెంచడంతో పాటు పూడిక తీస్తే పట్టణ తాగునీటి ఇబ్బందులు తలెత్తవు.

**ఫిల్టర్‌బెడ్‌కు రూ.80 లక్షలు**

రాజరాజేశ్వర గుట్ట సమీపంలో ఉన్న ఫిల్టర్‌బెడ్ పురాతనమైంది కావడంతో ఇటీవల కౌన్సిల్‌లో దానికి రూ.80 లక్షలు కేటాయించారు. పూర్తి మరమ్మతులు చేయడంతో పాటు మిషన్లు ఏర్పాటు చేయనున్నారు. కాగా చెరువుకు అనుసంధానంగా ఉన్న ఫిల్టర్‌బెడ్‌కు డబ్బులు కేటాయించారు కానీ చెరువు ఎత్తు, కట్ట మరమ్మతుకు కేటాయించలేదు. అధికారులు స్పందించి చెరువు విస్తరణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

| జగిత్యాల బల్దియాలో.. | |
|---|---|
| వార్డులు | 48 |
| పట్టణ జనాభా | 1,30,000 (సుమారు) |
| మొత్తం కుటుంబాలు | 35,000 |
| నల్లా కనెక్షన్లు | 14,342 |
| జలాశయం సామర్థ్యం | 30 అడుగులు |

### ప్రతిపాదనలు రూపొందించాం

ప్రస్తుతం ఫిల్టర్‌బెడ్‌కు రూ.80 లక్షలు కేటాయించాం. అందులో చెరువు కట్ట మరమ్మతులు సైతం చేయిస్తాం. విస్తరణకు ప్రతిపాదనలు రూపొందించాం. త్వరలోనే చేయించేలా చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం నీటి తిప్పలు లేవు. నూతన ఫిల్టర్ బెడ్‌ను ఏర్పాటు చేశాక చెరువు మరమ్మతులు చేపడతాం.

– రాజేశ్వర్, డీఈ

## క్లుప్తంగా

### వైభవంగా ధ్వజస్తంభ శిఖర ప్రతిష్ఠాపన


ఎమ్మెల్సీని సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

జగిత్యాల రూరల్ (రాయికల్): మండలంలోని సింగరావుపేటలో దాసాంజనేయస్వామి ఆలయ పునరుద్ధరణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ధ్వజస్తంభ శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ దీక్షాపరులు అధిక పాల్గొని హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అర్చకులు మంగోలి చిట్టిపంతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంచందర్ రావు, ఉపసర్పంచ్ భీమన్న పాల్గొన్నారు.

### స్వచ్ఛత యాత్రకు కోరుట్ల మహిళ


కేరళ వెళ్తున్న మహిళలు

కోరుట్ల: పట్టణానికి చెందిన శనిగారపు భాగ్య స్వచ్ఛోత్సవ్- 2023కు ఎంపికైంది. ఈసందర్భంగా శుక్రవారం స్వచ్ఛత యాత్రలో భాగంగా కేరళకు తరలివెళ్లారు. జిల్లా నుంచి ఒక్కరే మహిళ ఎంపిక అయినట్లు మెప్మా అధికారులు తెలిపారు. పట్టణంలో డీఆర్‌సీసీని సమర్థవంతంగా నిర్వహిస్తూ పొడి వనరుల సేకరణలో భాగ్య తనవంతు బాధ్యతను చక్కగా నిర్వహిస్తున్నారని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భాగ్యను మెప్మా ఎండీ సత్యనారాయణ అభినందించారు.

### పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

జగిత్యాలరూరల్ (రాయికల్): అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు మెక్కొండ రాంరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆలూరులో విలేకరులతో మాట్లాడారు. గురువారం రాత్రి కురిసిన అకాలవర్షానికి మొక్కజొన్న, నువ్వుల పంట నేలపాలైందని, గ్రామాల వారీగా సర్వే నిర్వహించి పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ రైతులు గడ్డం మల్లారెడ్డి, కోల రాజు, తోట రాజిరెడ్డి, శీలం సంతోష్, తదితరులు ఉన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్రగాయాలు

రామగుండం: రాజీవ్‌రహదారిపై కుందనపల్లి సమీపంలోని భారత్ పెట్రోల్ పంపు వద్ద శుక్రవారం ఎదురెదురుగా కారు–లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. అంతర్గాత ఎస్సై బోగె సంతోశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన రావుల రఘు–సరోజన దంపతులు బెల్లంపల్లిలో ఓ వివాహానికి హాజరయ్యేందుకు కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో కారు అదుపుతప్పి మధ్యలోని డివైడర్‌ను ఢీకొట్టి కరీంనగర్ వైపు కర్ర లోడుతో వెళ్తున్న లారీని ఢీకొంది. కారులో ఉన్న వారికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు.

# కాలం చెల్లినవి స్క్రాప్‌కే..

- స్పెషల్ డ్రైవ్‌లో 507 వాహనాలు సీజ్
- రోడ్లపైకి రాకుండా రవాణాశాఖ కఠిన చర్యలు
- కొరడా ఝులిపిస్తున్న అధికారులు

**జిల్లాలో మొత్తం వాహనాలు : 1,47,758**


స్క్రాప్ కింద తరలిస్తున్న బస్సు

జగిత్యాల క్రైం: రోడ్లపై కాలం చెల్లిన వాహనాలు నడుపుతుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ఆ వాహనాలను రోడ్లపై నడపకుండా జిల్లా రవాణా శాఖ కఠిన చర్యలు తీసుకుంటుంది. కాలం చెల్లిన వాహనాలతో పాటు, టాక్స్ చెల్లించని, ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, పర్మిట్లు లేని వాహనాలపై ప్రత్యేక డ్రైవ్‌తో అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. దీంతో జిల్లావ్యాప్తంగా రవాణాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టి అనుమతులు లేకుండా రోడ్లపై తిరుగుతున్న వాహనాలను సీజ్ చేస్తున్నారు.

**స్పెషల్ డ్రైవ్..**

జిల్లావ్యాప్తంగా గతనెల 15 నుంచి రవాణా శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇందులో ఇప్పటివరకు 507 వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. టాక్స్ చెల్లించని ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, పర్మిట్ లేని వాహనాలను పట్టుకున్నారు. దీంతో రోడ్లపై అనుమతులు లేని వాహనాలు తిరిగితే కొరడా ఝులిపిస్తూ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నారు.

**స్క్రాప్‌కింద తొలగిస్తూ..**

జిల్లా వ్యాప్తంగా కాలంచెల్లిన వాహనాలను గుర్తించి వాటికి అధికారులు ఫిట్‌నెస్ చేయకుండా నిలిపివేసి స్క్రాప్ కింద తొలగిస్తున్నారు. ఇప్పటి వరకు 15–20 వాహనాలు స్క్రాప్‌కింద తొలగించారు. వాహనాల యజమానులకు సమాచారం అందిస్తూ రోడ్లపై నడపవద్దని, వాహనాల వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలని అధికారులు సమాచారం అందిస్తున్నారు.

**స్క్రాపింగ్ ఇలా...**

కాలం చెల్లిన వాహన యజమాని తన వాహనాన్ని స్క్రాప్ చేయాలనుకుంటే నెంబర్‌తో తన వాహనాన్ని స్క్రాప్ చేసేందుకు ఆర్టీఏ కార్యాలయంలో దరఖాస్తు అందించాలి. దీంతో ఆ వాహనానికి సంబంధించిన ఆర్సీ ఒరిజినల్, పర్మిట్, మిగతా సంబంధిత పత్రాలు జతచేయాలి. అధికారులు ఆ దరఖాస్తును పరిశీలించి టాక్స్, జరిమానాలు, పర్మిట్ ఫీజులు పరిశీలించి ఎలాంటి ఇబ్బందులు లేకుంటే స్క్రాప్‌కు అనుమతులు జారీచేస్తారు. అనుమతి లభించగానే ఎంవీఐ సమక్షంలో స్క్రాప్ సెంటర్‌లో తుక్కు చేయాల్సి ఉంటుంది. ఇంజన్, వాహన నెంబర్ వివరాలను నోట్ చేసుకుని దానిని తుక్కు చేస్తారు.

### రోడ్డు ప్రమాదాల నివారణకే..



రోడ్డు ప్రమాదాల నివారణకు కాలం చెల్లిన వాహనాలను గుర్తించి స్క్రాప్ చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఇప్పటి వరకు 507 వాహనాలను సీజ్ చేశాం. టాక్స్, ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, పర్మిట్ లేని వాహనాలను సీజ్ చేశాం

–శ్యాం నాయక్, జిల్లా రవాణా శాఖ అధికారి

## సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి


అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

జగిత్యాల/ జగిత్యాల టౌన్ : టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీనిపై రాష్ట్రమంతా ఉద్యమాలు చేపడతామన్నారు. ఒక సెక్షన్ ఆఫీసర్ స్థాయిలోకి గ్రూప్ స్థాయి పేపర్లు వెళ్లడం ఎంత వరకు సమంజసమన్నారు. వెంటనే బాధ్యులను కఠినంగా శిక్షించి కేసులు నమోదు చేయాలన్నారు. నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, ఈశ్వరయ్య, రాంచంద్రం, శ్రీహరి, రాపర్తి రవి, వెంకటేశ్, సాయిరాజ్, మల్లేశ్ పాల్గొన్నారు.

## గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని గల్ఫ్ ఎన్నారై సెల్ మిడిల్ ఈస్ట్ కన్వీనర్ నరేంద్ర పన్నీరు డిమాండ్ చేశారు. శుక్రవారం జగిత్యాల ప్రెస్‌క్లబ్‌లో గల్ఫ్ కార్మికుల డిమాండ్స్ పోస్టర్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావుతో కలిసి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి రూ.500 కోట్ల వార్షిక బడ్జెట్ కేటాయించాలన్నారు. రేషన్ కార్డులు అందజేయాలని, గల్ఫ్ వెళ్లినవారి పేర్లను ఓటర్ లిస్టుల నుంచి తొలగించవద్దని కోరారు. హైదరాబాద్‌లో సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్ దేశాల రాయబార కార్యాలయాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. రూ.10లక్షల విలువైన ప్రవాస భారతీయ బీమా యోజనలో సహజ మరణాన్ని చేర్చాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. విదేశాల నుంచి తిరిగి వచ్చిన వారు జీవితంలో స్థిరపడేందుకు పునరావాస పథకం అమలు చేయాలని, గల్ఫ్ జైళ్లలో చిక్కుకున్న కార్మికులకు న్యాయ సహాయం అందించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, భూమి రమణకుమార్, మదన్‌మోహన్, అలగుర్తి లక్ష్మీనారాయణ, ఆముద రాజు, బోగ శ్రావణి, జున్ను రాజేందర్, మోహన్‌రెడ్డి, రాగిళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


భూమి పూజ చేస్తున్న మంత్రి కొప్పుల

వెల్గటూర్(ధర్మపురి): అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండలంలోని కిషన్‌రావుపేట గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేసి మాట్లాడారు. పేద, మధ్య తరగతి వర్గాల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, జెడ్పీటీసీ సుధారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేష్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో కాంట్రాక్టు లెక్చరర్ మృతి


సురేశ్(ఫైల్)

సారంగాపూర్(జగిత్యాల): సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 15 ఏళ్లుగా కాంట్రాక్టు లెక్చరర్‌గా పని చేస్తున్న సట్టు సురేశ్ (40) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. మహబూబాబాద్ జిల్లా ఎనగుర్తి మండలానికి చెందిన సురేశ్ 2008 నుంచి తెలుగు కాంట్రాక్టు లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. కొద్దిరోజులుగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నెల 16 వరకు విధులు నిర్వహించి స్వగ్రామానికి వెళ్లాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొంక వేణు, ఇంటర్ నోడల్ అధికారి నారాయణ, సారంగాపూర్ కళాశాల అధ్యాపకులు సురేశ్‌కు నివాళి అర్పించారు.

## శుభకార్యానికి వెళ్తూ... తిరిగి రాని లోకాలకు

- రోడ్డు ప్రమాదంలో భార్య మృతి.. భర్త ,మరొకరికి గాయాలు
- ఆర్టీసీ బస్సు...లారీ డ్రైవర్ల అజాగ్రత్తే కారణం


సౌజన్య(ఫైల్)


ప్రమాద స్థలంలో సౌజన్య, మధుకర్

మంథని: ఓ శుభకార్యానికి వెళ్తున్న భార్యభర్తలను ప్రమాద రూపంలో భార్యను మృత్యువు కబలించగా భర్త తీవ్రంగా గాయపడ్డాడు. వీరితో పాటు వచ్చిన సమీప బంధువైన బాలుడికి సైతం తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం మంథని మండలం భట్టుపల్లి బస్టాఫ్ వద్ద చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మంథని మండలం ఖానాపూర్‌కు చెందిన రాపాక మధూకర్ తన భార్య సౌజన్య(28) అన్న కుమారుడు యశ్వంత్‌తో కలిసి బైక్‌పై జయశంకర్ భూపాలపల్లి జిల్లా గొర్లవీడులో జరిగే శుభకార్యంలో పాల్గొనేందుకు వెళ్తున్నారు. మార్గమధ్యలో భట్టుపల్లి బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సు నిలిచి ఉండడంతో పక్క నుంచి వెళ్తున్నారు. ఈ క్రమంలో బస్సుడ్రైవర్ బైక్‌ను గమనించకుండా సైడ్‌నుంచి ఢీకొట్టడంతో బైక్‌పై నుంచి ముగ్గురు కిందపడ్డారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న లారీ వేగంగా, అజాగ్రత్తగా వస్తూ మధూకర్, యశ్వంత్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి కాలు, తలకు గాయాలయ్యాయి. సౌజన్య తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమై స్పాట్‌లోనే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. గాయపడిన మధూకర్, యశ్వంత్‌ను మంథని సామాజిక వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించి కరీంనగర్ తరలించారన్నారు. మృతురాలి తండ్రి నాంసాని అంజయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### నదిలో దూకేందుకు యత్నం..

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోదావరి బ్రిడ్జి పైనుంచి శుక్రవారం నదిలోకి దూకేందుకు యత్నించిన ఓ వ్యక్తిని రివర్ పోలీసులు కాపాడారు. టూటౌన్ పోలీసులు, రివర్ పోలీసులు కథనం ప్రకారం.. యైటింక్లయిన్‌కాలనీకి చెందిన ఓ వ్యక్తి కుటుంబ సమస్యలతో కొంతకాలంగా మానసికవేదనకు గురవుతున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది తన వాట్సప్‌లో మెడలో దండవేసుకుని ఫొటోపై ఓం శాంతి అని రాసుకుని గోదావరినది వద్దకు వచ్చి దూకేక్రమంలో అక్కడే విధులు నిర్వహిస్తున్న రివర్ పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. అనంతరం కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. అన్ని సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదని టూటౌన్ సీఐ వేణుగోపాల్ సూచించారు. సదరు వ్యక్తిని కాపాడిన రివర్ పోలీసులను సీఐ అభినందించారు.

### రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

కథలాపూర్(వేములవాడ): మండలంలోని కలిగోట గ్రామశివారులో శుక్రవారం సాయంత్రం ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో జగిత్యాల మండలం అంతర్గాంకు చెందిన ఎండీ నజీర్‌కు తీవ్రగాయాలైనాయి. పోలీసుల వివరాలు.. నజీర్ రుద్రంగి నుంచి కోరుట్ల వైపు బైక్‌పై వెళ్తుండగా, కోరుట్ల నుంచి రుద్రంగి వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. నజీర్‌కు తీవ్రగాయాలు కావడంతో కోరుట్ల పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని ఏఎస్సై ఎండీ ఆలీమొద్దీన్ పరిశీలించారు.

### ఒకరిపై కేసు

సారంగాపూర్ : బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారం గ్రామంలో ఓ మహిళ (65)తో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై అజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సదరు మహిళను అదే గ్రామానికి చెందిన అల్లూరి సత్తిరెడ్డి ఆమె ఇంట్లోకి చొరబడి అసభ్యంగా ప్రవర్తించాడు. సదరు మహిళ ఫిర్యాదు మేరకు సత్తిరెడ్డిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### కొండగట్టు టెండర్లపై కమిషనర్‌కు ఫిర్యాదు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలో ఈనెల 16న నిర్వహించిన టెండర్లలో ఆలయ అధికారులు, టెండరదారులు కుమ్మక్కు కావడంతో ఆలయానికి దాదాపు రూ.50లక్షల నష్టం వాటిల్లిందని కొడిమ్యాల మండలం నమిలికొండకు చెందిన కూనవేని రాజశేఖర్ శుక్రవారం దేవాదాయ కమిషనర్ అనిల్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే టెండర్‌లపై విచారణ జరిపి మరోసారి నిర్వహించాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

### మహిళ మెడలోంచి గొలుసు చోరీ


కుంభాజి లక్ష్మి

ఇబ్రహీంపట్నం : మహిళ మెడలోంచి బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన ఘటన మండలకేంద్రంలో శుక్రవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన కుంభాజి లక్ష్మి ఇంటిముందు పనిచేస్తుండగా కిందపడిపోయింది. అదే అదునుగా భావించిన ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోంచి రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడును లాక్కెళ్లాడు. పోలీసులకు సమాచారం అందించగా మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై ఉమసాగర్ చేరుకున్నారు. బాధితురాలి నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

### చిలకజోస్యంపై ఆసక్తి


జ్యోతిష్యం గురించి తెలుసుకుంటున్న యువతులు

జగిత్యాలటౌన్ : సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో ఉన్నత చదువులు చదివిన యువత తమ భవిష్యత్తుపై చిలక జోస్యంపై ఆసక్తి కనబరుస్తున్నారు. జగిత్యాల తహసీల్ కార్యాలయం వద్ద కొందరు యువతులు తమ భవిష్యత్తు గురించి తెలుసుకునేందుకు జ్యోతిష్యుడికి జాతకం చూపెట్టుకుంటున్నారు. ఆధునిక యుగంలోనూ చిలక జోస్యానికి ఆదరణ తగ్గలేదని పలువురు చెబుతున్నారు.

## వ్యవసాయ కళాశాలలో విద్యార్థుల ఆందోళన

జగిత్యాల అగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ కళాశాలలో శుక్రవారం రాత్రి విద్యార్థులు ఆందోళన చేపట్టారు. వివరాలు.. వ్యవసాయ కళాశాలలో ఈ ఏడాది చేరిన ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు రెండో ఏడాది విద్యార్థులు ఫ్రెషర్స్ పార్టీ ఏర్పాటు చేశారు. ఇందుకు కళాశాల యాజమాన్యం కొంత డబ్బు, రెండో ఏడాది విద్యార్థులు కొంత డబ్బు జమచేసి ఫ్రెషర్స్ పార్టీ నిర్వహించారు. రెండో ఏడాది విద్యార్థులు ఈ పార్టీకి మూడో ఏడాది, నాల్గో ఏడాది విద్యార్థులను సైతం ఆహ్వానించారు. మూడు, నాల్గో ఏడాది విద్యార్థులు ఫ్రెషర్స్ పార్టీకి వెళ్లగా.. వ్యవసాయ కళాశాల డీన్‌తో పాటు స్టూడెంట్ ఎఫైర్ కన్వీనర్ అడ్డుకున్నారని విద్యార్థులు ఆరోపించారు. దీంతో కళాశాల యాజమాన్యానికి వ్యతిరేకంగా ఫ్రెషర్స్ పార్టీ నిర్వహించే హాల్ ముందు ఆందోళనకు దిగారు. ఈ విషయాన్ని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌తో పాటు ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు విద్యార్థులు తెలిపారు.

## సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం


సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్ : టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీలను నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండ మధు మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను పదవినుంచి తొలగించడమే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బల్దియా ఫ్లోర్ లీడర్ కల్లెపెల్లి దుర్గయ్య, నాయకులు మన్సూర్, బాపురెడ్డి, రియాజ్, అనిల్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## బెదిరింపులకు పాల్పడుతున్న ఇద్దరిపై కేసు

గొల్లపల్లి (ధర్మపురి): ఓ రైతు వ్యవసాయ భూమిలోకి అక్రమంగా ప్రవేశించి బెదిరింపులకు పాల్పడుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని భీంరాజ్‌పల్లిలో బొమ్మెన భీమయ్యకు చెందిన సర్వేనంబర్ 236లోని భూమిని సాగు చేసుకుంటున్నాడు. చిల్వాకోడూర్ గ్రామానికి చెందిన తక్కళ్ల మహేశ్ భూమి తమదంటూ గొడవకు దిగగా కొన్ని సంవత్సరాల నుంచి బీడుగా ఉంది. నెలరోజుల క్రితం రెవెన్యూ శాఖ అధికారులు మోకా పై సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేశారు. గురువారం సాయంత్రం తక్కళ్ల మహేశ్, తాండ్ర శంకర్‌గౌడ్ జేసీబీతో భీమయ్య భూమిలోని హద్దులను తొలగించడంతో పాటు భూ యజమానిని బెదిరించారు. బొమ్మెన భీమయ్య ఫిర్యాదు మేరకు తక్కళ్ల మహేశ్, తాండ్ర శంకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య

రామగిరి(మంథని): ముత్తారం మండలం లక్కారం గ్రామానికి చెందిన పంజాల శ్యామల(40) వివాహిత కడుపు నొప్పి భరించలేక క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. ముత్తారం ఎస్సై రాములు కథనం ప్రకారం.. గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారాముల ఆలయం ప్రతిష్ఠాపనోత్సవాలకు కొడుకు శ్రీకాంత్‌తో గురువారం సాయంత్రం కలిసి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చింది. ఈక్రమంలో శ్యామలకు విపరీతంగా కడుపు లేవడంతో శ్రీకాంత్ స్థానిక ఆర్‌ఎంపీ వైద్యుడిని తీసుకువచ్చేలోపు క్రిమిసంహారక మందుతాగి అపస్మారక స్థితికి చేరడంతో గమనించిన శ్రీకాంత్ తన స్నేహితుడి సాయంతో పెద్దపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించారు. వైద్యుల సూచనతో కరీంనగర్‌లోని ప్రైవేట్‌ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందింది. మృతురాలి కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## చోరీ కేసులో ఒకరి రిమాండ్


స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

బోయినపల్లి (చొప్పదండి): చోరీకేసులో ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ రూరల్ సీఐ బన్సీలాల్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నీలోజిపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన సత్తయ్య ఇంట్లో ఈనెల 3న, 11 తులాల బంగారు, నగలు, 6 తులాల వెండి ఆభరణాలు, రూ.25 వేల నగదు చోరీ జరిగింది. దీంతో బోయినపల్లి పీఎస్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్పీ అఖిల్ మహాజన్, వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి ఆదేశాల మేరకు సిబ్బంది విచారణ చేపట్టారు. ఈనెల 16న వేములవాడ ఆలయ పరిసరాల్లో జగిత్యాల జిల్లా కొండగట్టుకు చెందిన పసుపులేటి అశోక్‌ను విచారించగా నిజం ఒప్పుకున్నాడు. అతని నుంచి 2 తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. అంతకుముందు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జగిత్యాల, చొప్పదండి, వెల్గటూర్, గొల్లపల్లి, రామడుగు పీఎస్‌ల పరిధిలో దొంగతనాలు చేసి జైలుకు వెళ్లాడు. కాగా జైలులో పరిచయమైన ఓ వ్యక్తితో కలిసి అశోక్ నీలోజిపల్లిలో చోరీకి పాల్పడినట్లు తెలిపారు. నగలను విక్రయించేందుకు వేములవాడ రాగా చాకచక్యంగా అశోక్‌ను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మరో మరో వ్యక్తిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు.